గుండెకు భరోసా

గుండె నొప్పి లక్షణాలు కనిపించిన గంటలోపు వైద్యులను కలిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ సమయాన్ని వారు గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. స్ట్రోక్ వచ్చిన వారికి గతంలో స్థానిక ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స లభించేది కాదు. అయితే 2023లో వైఎస్ జగన్ హయాంలో స్టెమీ ప్రాజెక్టును అమలు చేశారు. గోల్డెన్ అవర్‌లో వచ్చిన రోగికి అత్యవసర వైద్యం అందించడం, అలాగే ముఖ్యమైన ఖరీదైన టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ ఉచితంగా వేసి ప్రాణాలు కాపాడటమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం. ఈ ఇంజెక్షన్ వేయడంతో ఆలూరు సీహెచ్‌సీ పరిధిలో ఏడాదిలోపు 17 మందిలో 16 మంది ప్రాణాలు కాపాడగలిగారు.

- స్టెమీ ప్రాజెక్టును 2023లో ప్రారంభించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- గుండె జబ్బు మరణాలను తగ్గించడమే లక్ష్యం
- అత్యవసర ప్రాథమిక చికిత్సతో తగ్గిన గుండెపోటు మరణాలు
- ఆలూరు సీహెచ్‌సీలో ఇప్పటి వరకు 17 మందికి టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్



ఆలూరు రూరల్: హార్ట్ ఎటాక్ కేసుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ఏ మాత్రం ఆలస్యం చేసినా రోగి ప్రాణాలకే ప్రమాదం. స్ట్రోక్ వచ్చిన వారిలో 50 శాతం రోగులు ఆసుపత్రికి చేరేలోపు మరణిస్తున్నారు. తీవ్రమైన కేసుల్లో ఆసుపత్రికి చేరిన తర్వాత కూడా 90 శాతం మంది మరణిస్తున్నారు. ఛాతిలో నొప్పి వచ్చిన గంటలోపు ఆసుపత్రిలో చేరితే ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు చెబుతున్నారు. గతంలో గుండె సంబంధిత వ్యాధులు, గుండె పోటుకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర ప్రాథమిక చికిత్స జరిగేది కాదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, సూపర్ స్పెషాలిటీ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉండేది. ఇక్కడ పరీక్షలు, మందులకు అయ్యే ఖర్చు పక్కన పెడితే ఒక్క ఇంజెక్షన్‌కే రూ.40–రూ.45వేలు వెచ్చించాల్సి వచ్చేది. ఈ మొత్తం పేద, మధ్యతరగతి వారికి భారంగా మారేది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె జబ్బులకు అత్యవసరమైన ప్రాథమిక వైద్యం లేక, ఖర్చుల భయంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక గుండె జబ్బు వచ్చిన పేద,మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.




స్టెమిపై ఆలూరు సీహెచ్‌సీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు (ఫైల్)

వైఎస్ జగన్ ప్రభుత్వంలో..

గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2023లో స్టెమీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటి గంటలో అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే కార్యక్రమమే ఈ స్టెమీ ప్రాజెక్ట్. గుండెపోటుకు గురై మరణించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కార్డియాలజీ సేవలు మరింత విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలని భావించి అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియోజకవర్గ కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ చికిత్సను అందుబాటులో తెచ్చింది. గుండెపోటు వచ్చిన రోగికి 40 నిమిషాల సమయంలో అవసరమైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడటమే స్టెమీ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గోల్డెన్ అవర్‌లో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చిన గుండె జబ్బు బాధితుడికి రూ.45 వేల ఇంజెక్షన్ ఉచితంగా ఇవ్వడంతో పాటు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి గుండెపోటు చికిత్స అందించేలా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఆలూరు సీహెచ్‌సీలో 17 మందికి టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌లు..



స్టెమీ ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 17 మందికి రూ.45 వేలు విలువ చేసే టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌లు వేశారు. ఆలూరు పరిసర ప్రాంతాలకు చెందిన వీరంతా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన వారే. వీరిలో ఒకరు ఇంజెక్షన్ వేసిన తర్వాత గుండె ఆపరేషన్ సమయంలో మరణించారు. మిగిలిన వారంతా ఆరోగ్యంగా ఉన్నట్లు ఆలూరు సీహెచ్‌సీ వైద్యులు, వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

మొదటి గంటలోపు ఆస్పత్రికి రావాలి

గుండెపోటు లక్షణాలు కనిపిస్తే మొదటి గంటలోపు నియోజకవర్గ కేంద్రంలోని ఆస్పత్రికి ఆలస్యం చేయకుండా రావాలి. సీహెచ్‌సీలో గుండెపోటుకు ఉచితంగా రూ.45 వేల ఇంజెక్షన్ ఇస్తారని చాలా మందికి తెలియదు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఇంజెక్షన్ పేదలకు ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా ప్రాణాలను నిలుపుతుంది. ఈ లోపు ఉన్నత ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవచ్చు.

– వాహిద్, మెడికల్ ఆఫీసర్,ఆలూరు సీహెచ్‌సీ

క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కృష్ణగిరి: పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో సోమవారం ఆయన నులిపురుగుల నివారణ పోస్టర్‌ను అవిష్కరించి, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. అపరిశుభ్రతతోనే అనేక రోగాలు ప్రబలుతాయని చెప్పారు. వైద్యాధికారి వరప్రసాద్, ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి, ఎంపీహెచ్ ఈఓ గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ఆస్పరి: శివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు స్థానిక కర్నూలు రోడ్డులో ఉన్న పక్కీరప్ప తాత ఆలయం వద్ద గ్రామస్తులు సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు కాలినడకన శ్రీశైలం వెళ్తున్నారని, మూడేళ్లుగా అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, గురుస్వామి రామాంజనేయులు ఉన్నారు.

పాఠశాలను కొనసాగించాలి

కృష్ణగిరి: స్థానిక ఎస్టీ కాలనీలో ఉన్న ఎస్టీ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకల రాజు కోరారు. సోమవారం కర్నూలులోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వేదికలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. రేషనలైజేషన్ పేరుతో 3, 4, 5 తరగతులను మెయిన్‌స్కూల్‌లో కలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పాఠశాలను తరలిస్తే ఇందులో చదువుతున్న విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. 5వ తరగతి వరకు యథావిధిగా కొనసాగించి స్కూల్‌ను అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కోరినట్లు తెలిపారు.

గడ్డివాముల దగ్ధం



కాలిపోతున్న గడ్డివాములు

హొళగుంద: మండలంలోని వందవాగిలి గ్రామంలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు కాలిపోయాయి. గ్రామంలో జరుగుతున్న రథోత్సవం సందర్భంగా కాల్చిన బాణసంచా గడ్డివాములపై పడి ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో గొరవ వెంకన్న, అతని అన్నదమ్ములకు చెందిన మూడు గడ్డి వాములు కాలిపోయి దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు. స్థానికులు ఆదోని, ఆలూరు ఫైర్ స్టేషన్లకు సమాచారమివ్వగా ఫైర్ ఇంజన్ వచ్చేలోపు వాములు పూర్తిగా కాలిపోయాయి.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

కృష్ణగిరి: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మ్యుటేషన్, సర్వేపై ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండా చేయరాదని సూచించారు. అలాగే పనుల నిమిత్తం వచ్చే రైతుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.రీ సర్వేను పగడ్బందీగా చేపట్టాలన్నారు. /డీటీ లక్ష్మిరాజు, ఆర్ఐ మనోహర్, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు చికిత్స సాధ్యం

వెల్దుర్తి: ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలిపారు. సోమవారం పట్టణంలోని హెల్త్ క్లినిక్-3, సచివాలయం-1లో వైద్యాధికారి భువనతేజ ఆధ్వర్యంలో జరుగుతన్న 104 వైద్య సేవలను పరిశీలించారు. ఎన్‌సిడి 3.0లో భాగంగా 30ఏళ్ల దాటిన వారందరికీ ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన

మద్దికెర : సైబర్ నేరాలు పెరుగుతున్నందున టీనేజీ అమ్మాయిలు ఫోన్లు, ఇంటర్నెట్, ఫేస్‌బుక్ వంటివి వాడటంలో జాగ్రత్తలు పాటించాలని, ఏదైనా సమస్య వచ్చినట్లయితే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ సూచించారు. సోమవారం స్థానిక ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ సవిత పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు రూరల్: అత్యాశతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోవద్దని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆలూరు సీఐ వెంకట చలపతి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు చెప్పరాదని బ్యాంకు ఖాతా,ఆధార్,పాన్ నంబర్లను అపరిచిత వ్యక్తులకు పంపవద్దని సూచించారు. డిజిటల్ అరెస్టు అనేది చట్టంలో లేదని ఇది ఒక రకమైన మోసమని తెలిపారు. సైబర్ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి



మాట్లాడుతున్న సహకారం సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ అశోకకుమార్

తుగ్గలి : రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని మారెళ్ల అశోక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. సహకార బ్యాంకు ద్వారా దాదాపు రూ.10 కోట్లు దీర్ఘకాలిక రుణాలు అందజేశామన్నారు. రుణాలు తీసుకున్న 65 మంది రైతులు రుణ బకాయిలు చెల్లించలేదని, దీంతో ఇప్పటికే వారికి నోటీసులు అందిచామన్నారు. మార్చి 25వ తేదీలోగా వడ్డీలు చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని, లేనిపక్షంలో వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకు ముందు బ్యాంచ్ మేనేజర్ సింగం శ్రీనివాసులు, సీఈవో మనోహర్‌నాయుడు ఎద్దులొడ్డి, పెండేకల్లు, నునుసరాల్ల, ముక్కెల్ల, రాంపల్లి, మారెల్ల, బొందిమడుగుల గ్రామాల్లో పర్యటించి గడువులోగా రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని రైతులను కలిసి వివరించారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి



తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆస్పరి: మిర్చి దిగుబడికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు.. రైతులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధార్నా చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి కూడా రాకపోవడంతో కూలీల ఖర్చు చేతి నుంచి భరించాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి అందజేశారు. నాయకులు రామాంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, రవి, ఈరన్న, వెంకటరాముడు, శీనప్ప, షెక్షావలి, పరుశురాముడు, తిప్పన్న పాల్గొన్నారు.

మిర్చి పంటకు మద్దతు ధర కల్పించండి

దేవనకొండ: మిర్చి పంటకు కనీస మద్దతు ధరను కల్పించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు,సీనియర్ నాయకులు బజారి, బాషా, తదితరులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వీరశేఖర్ మాట్లాడుతూ మిర్చి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైయిందని మండిపడ్డారు. అనంతరం వినతిపత్రాన్ని వారు తహసీల్దార్‌కు అందజేశారు.

హాలహర్వి: మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతనం తహసీల్దార్ నజ్మాబానుకు వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు విఠల్ నాయకులు రామాంజిని, నాగనగౌడ్, లింగన్న పాల్గొన్నారు.

రమణీయం.. వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు




పత్తికొండలో అశేష జనవాహిని మధ్యన బ్రహ్మంగారి రథోత్సవం

పత్తికొండ రూరల్ : పత్తికొండలో కొలువైన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి రథోత్సవం సోమవారం రమణీయంగా జరిగింది. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మయ్యాచారి ఆధ్వర్యంలో అర్చకులు బ్రహ్మరథాంగ హోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. తేరును ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. సాయంత్రం 4గంటలకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, తప్పెట్లు, భక్తుల కోలాహలం మధ్యన స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు తరలి రావడంతో తేరుబజారు ప్రాంతం జనసమ్మర్ధంతో కిక్కిరిసిపోయింది. తేరుపైకి అరటిపండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, ఆర్డీఓ భరత్‌నాయక్ , సర్పంచు కొమ్ముదీపిక, పంచాయతీ ఈఓ నరసింహులు, నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో సీఐ జయన్న, ఎస్ఐ గోపాల్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్రహ్మంగారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి..

స్థానిక పాతపేటలో కొలువైన స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఎల్లారెడ్డి ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తేరు వద్ద పార్టీ నాయకులతో కలిసి పూజలు చేశారు. ఎంపీపీ నారాయణదాస్, మండల కన్వీనర్ కారం నాగరాజు, పార్టీ నాయకులు బాబుల్ రెడ్డి,వెంకట్రామిరెడ్డి, బనగాని శ్రీనివాసులు, భాస్కర్ నాయక్, చక్రాళ్ల సర్పంచు శ్రీరాములు పాల్గొన్నారు.

వైభవం..వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వరస్వామి



రథోత్సవం జరుగుతున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని వందవాగిలి గ్రామంలో సోమవారం సాయంత్రం భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి రథోత్సవ వైభవంగా జరిగింది. ఆలయ పదో వార్షికోత్సవంలో భాగంగా ఉదయం మహా రుద్రాభిషేకం జరిపించారు. అనంతరం గ్రామస్తులు వీరభద్రేశ్వరస్వామి వీరఘాసీ వచనాలతో నందికోలు ఊరేగింపు, కుంభోత్సవం చేపట్టారు. అనంతరం ఆలయంలో భద్రకాళి, వీరభద్రేశ్వరునికి కల్యాణోత్సవంతో పాటు పల్లకీ సేవ ఇతర ప్రత్యేక కార్యక్రమాలు చేయించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి అశేష భక్త జనుల మధ్య రథోత్సవాన్ని సాగించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే విరూపాక్షికి వితని ప్రతం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు,ఏఐటీయూసీ నాయకులు

ఆస్పరి: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, బాలకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న 164 అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీఓ మద్దమ్మకు వినతి పత్రం ఇచ్చారు. కార్యకర్తలు జ్యోతి, మహబూబ్ బేగం, విశ్వకుమారి, రాధా పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ నాయకులు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే విరూపాక్షికి వినతి పత్రం అందజేశారు. చిప్పగిరి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో సమ్మె కాలంలో గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలు నరవేర్చడం లేదని ఎమ్మెల్యే విరూపాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు ప్రమీలమ్మ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు కృష్ణమూర్తి,కార్యదర్శి రంగన్న ఉన్నారు.

ఆలూరులో..

అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు నారాయణ స్వామి అన్నారు. ఆలూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలతో కలిసి ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ నాయకులు మైనా,గోవర్ధన్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పత్తికొండ రూరల్ : పట్టణంలో రెండు వేర్వేరు చోట్ల పేకాట ఆడుతున్న 11మందిని సోమవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు. కంబగిరి, వెంకటేశ్వర్లుతో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,200, కృష్ణారెడ్డి తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి రూ.5,550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తిమ్మప్పస్వామి ఉత్సవాలు ప్రారంభం

మద్దికెర : మండలంలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప, దడేదూలప్ప, ఎడవళప్ప స్వామి వార్ల ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా డప్పు వాయిద్యాలతో జలాన్ని తెచ్చి గంగ పూజ అనంతరం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ



జియోమైసూర్ సర్వీసెస్ గోల్డ్ మైనింగ్ పైలట్ ప్రాసెసింగ్ యూనిట్

తుగ్గలి : బంగారు నిక్షేపాల వెలికితీతకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11గంటలకు జొన్నగిరి సమీపంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించనున్నామని జియోమైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ కంపెనీ పీఆర్వో రామ్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రూ.320 కోట్లకు పైగా పెట్టుబడితో చేపట్టనున్న బంగారు నిక్షేపాల వెలికతీతకు 2013లోనే ప్రభుత్వ అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద గోల్డ్ ఓర్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పామన్నారు. మరి కొద్ది నెలల్లో పెద్ద యూనిట్ ప్రారంభం కానున్న దృష్ట్యా పర్యావరణంపై మరోసారి ప్రజాభిప్రాయణ సేకరణ చేపట్టినట్లు తెలిపారు. సమావేశానికి పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ హనుమప్రసాద్, ప్రతినిధి మానసరంజన్ హాజరవుతారని వివరించారు. రైతులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

వేడుకగా.. విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు





12 జ్యోతిర్లింగాలు, అమరనాథ లింగం ప్రతిష్ఠించిన దృశ్యం, హోమం నిర్వహిస్తున్న భక్తులు



గాయత్రీమాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆరాధనోత్సవాల సందర్భంగా మూడవ రోజు సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకగా నిర్వహించారు. వేదపండితులు అనిల్ కుమార్ శర్మ, రామసుబ్బయ్య శాస్త్రి, సరేంద్ర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ,ఆకుపూజ, 12 జ్యోతిర్లాంగాలు, అమరనాథలింగం, శనగల బసవన్న, అభయాంజనేయస్వామి, ధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. రథాంగ హోమం,బలి, పూర్ణాహుతి, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. శంకరబండ గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం భక్తులు గాయత్రీ మాత నామ స్మరణతో రథాన్ని నంది విగ్రహం వద్దకు లాగారు. ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దొర బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు గోవర్ధన, సుంకర రామాంజనేయులు,మూలింటి రాఘవేంద్ర, అశోక్,తిమ్మప్ప, ప్రకాష్, తోయజాక్షప్ప,వేణుగోపాల్, పాల్గొన్నారు.



రామతీర్థంలో రథోత్సవం



హొళగుంద పోలీస్‌స్టేషన్ పక్కన చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

చెత్త, మురుగు తొలగింది

సాక్షి ఎఫెక్ట్

హొళగుంద: స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన దుర్గంధం వెదజెల్లుతున్న చెత్త, మురుగును సోమవారం పంచాయతీ అధికారులు తొలగింపు పనులు చేపట్టారు. గ్రామంలో ఇటీవల జరిగిన సిద్ధేశ్వర స్వామి జాతర సందర్భంగా ఈ స్థలంలో వ్యాపారులు జాయింట్ వీల్, బోటింగ్, ఊయాల తదితర ఆటల సామగ్రి వేసి వారం రోజుల పాటు వ్యాపారం నిర్వహించారు.జాతర అనంతరం నిర్వాహకులు చెత్త, మురుగు తొలగించకుండ వెళ్లిపోయారు. దీంతో ఆ ప్రాంతం నిల్వ ఉన్న చెత్త, మురుగుతో దుర్గంధం వెదజెల్లుతుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై సోమవారం సాక్షి దినపత్రికలో ' జాతర ముగిసింది.. మురుగు మిగిలింది! ' అనే కథనం ప్రచరితమవడంతో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌గౌడ్ స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అలాగే ఎస్‌బీఐ బ్యాంకు ఏరియాలో కూడా పారిశుద్ధ్య పనులు చేయించారు.